విధుశీ : ( మొదటి రెండూచేసి ) పెళ్ళాడ్డానికీరామాన్సు చాలునా ?

మధుర : ఎక్కువ ! ఈమాటు నిజంగా మృత్యుదేవత వచ్చినా జయించి పాఱవెయ్యగలనన్నమాట.

విధుశీ : తథాస్తు.

.... .... .... .... ....

## సిగరెట్ పడిపోయింది !

బెజవాడ వద్దకు బిట్రగుంటనుంచి వచ్చే ప్యాసింజరు వచ్చి ఒకగంట ఆగుతుంది. కాని జనం ఆ బండివచ్చి వేళకాక గంట ముందుగాను వస్తారు. ఒకగంట అయ్యాక వస్తారు. అంతచేటు "ఇర్రెగ్యులర్" అది సర్వసాధారణంగా అన్నిరైళ్లు అంతే అనుకోండి ! వాటియొక్క నడక శీతోష్ణస్థితిని మారేటట్లు కనబడుతుంది, రైల్వేగైడ్‌లో ఏ టైము ఇచ్చినా ?

అందరలోనూ ముందుగా వస్తారు రెండవ తరగతి గాడీ ఎక్కేవాళ్ళు ! ఎంచేతా అంటే ఆ తరగతి బండి ఒకటే తగిలిస్తారు ఆ ప్రయాణికి. అందులోనే ఇరుక్కు ఇరుక్కు కూర్చోవాలి ! అందువల్ల ప్రయాణీకులు గంట గంటన్నరముందుగానే వచ్చి ఆలా బండిలో పరుపులబల్ల అంతా వ్యాపించుకొని మరొకళ్ళు ఎక్కకుండా తామే కూర్చుంటారు. సాగనంపడానికి వచ్చిన వాళ్ళుకూడా చివరకంట ఆ బల్లమీద ప్రయాణీకుల్లా కూర్చుండి కూర్చుండి చివరకుగాని దిగరు. ఇది నిత్యము చూచే సంఘటనే కాని ఆ ప్రొద్దుగన్నాది మరీ విడ్డూరమైంది ! ఎందుకు చదువుతారుగా పాఠకులు నేనడం ఎందుకు విడ్డూరమని ?

ఒక్కొక్క విషయం ఒక్కొక్కనాడు జ్ఞాపకం వస్తుంది. ఈ నే వ్రాయబోయే సందర్భం ఒకానొక నాగులచవితినాడు జరిగింది. మళ్ళీ నాకు జ్ఞాపకం వచ్చింది నాగులచవితినాడే. నాగులచవితి తెనుగువాళ్ళకు బహుపవిత్రమైన పర్వదినం. ఆరోజు చరిత్రాత్మకంగా "నాగుల" చరిత్ర ఉద్ఘోషిస్తుంది. మరిన్ని హిందూమత సిద్ధాంతంగా మన కపకారం చేసేవాళ్ళకూ కూడా ఉపకారం చేయాలి కనుక పాములకు పాలుపోస్తారు. ఇంకా ఏమైనా ఉండవచ్చు కారణాలు. అందుకే ఆరోజు ఆడవాళ్ళకు బహుప్రీతి. ఆడవాళ్ళతోబాటు పిల్లలకు, పిల్లలతోబాటు పెద్దలకు అందరకూ ఇష్టమైనరోజు అనే చెప్పాలి. ప్రసాదం, చిమ్మిలి, చలిమిడి, అరటిపళ్ళు ఇత్యాదులు మిక్కిలి తియ్యగా ఉండేవి అయియుంటాయి. మరిన్నేచ్చేగా పొలాలంట ఊరిబయటకు వెళ్ళి పాము బొరియలు కనిపెట్టి మరీపోస్తారు పాలు పాముల్లేకుండా చూచి; పాముంటే అమ్మయ్యో మరిబుస్సే!

దిబ్బు దిబ్బు దీపావళి అమావాస్య
మళ్ళీ వచ్చేది నాగుల చవితి."

అని కుఱ్ఱవాళ్ళు దీపావళినాడే ఈ పర్వదినానికూ కూడా కొన్ని టపాకాయలు, మతాబులు కేటాయించి యుంచుకుంటారేమో ఆ రోజున పట్టపగలే అవన్నీ వినోదవంతంగా కాలుస్తారు.

అయితే నాగులచవితి అన్నరోజు చవితి కావడంచేత ప్రయాణానికి మంచిరోజా అనే మీమాంసలో పడ్డారు ఇంటిల్లపాదీని "సుఫాలరావు" ఇంట్లో; ఉపవాసాలుండే వాళ్ళుంటున్నారు. ఫలహారాలు చేసేవాళ్లు చేస్తున్నారు. భోజనాలు కావించేవాళ్లు కానిస్తువున్నారు. గడియారంకేసి తిథివార నక్షత్రాలు తెలిపే కేలండరుకేసి ముసలమ్మలకేసి చూసేవాళ్లు చూస్తున్నారు.

అప్పుడు వారందరిలోనా ముసిలావిడ వణుక్కుంటూ వచ్చి, రేపు "సుఫాలరావు" "జాయిన్" అవవలసిన రోజు అనుకుంటాను. ఇవన్నీ చూస్తే ఉద్యోగాలుంటాయటర్రా! నిర్ఘ్యం నిన్నే పెట్టించాను కోడలిచేత. కోడల్ని పిల్లల్ని వాణ్ణి మరి ఆపక ఈ ప్రయాణానికి పంపించండి. నేనున్ను "కారు" మీద రైలుదాకా వెళ్ళి వాళ్ళను సాగనంపి వస్తాను. అంది పాపమ్మ, పాపమ్మ అంటే పైని వివరించిన ముసిలావిడే! పాపమ్మ ఈ మాట ఎప్పుడంటుందా అని కూర్చుంది కోడలు. భార్య అడ్డుచెప్పక పోవడమెప్పుడా అని వున్నాడు సుఫాలరావు. మరి సుఫాలరావు సుఫాలరావు కుటుంబం. ఈ పాపమ్మ అనే ముసిలి తల్లి, కలగట్టుకు పడ్డట్టు వెంటనే "కారులో" పడి స్టేషనుకు చేరుకు రైలందుకు రైల్లోసలక్షణంగా ఆసీనులయ్యారు.

ముసిలావిడ వితంతువు. ఏ రష్యాలోనో వుంటే నూట ఇరవై యేళ్ళక్రితపు ఆవిడఅని ఛాయాపటము తీసివుందురు. మనదేశంలో ఆ పద్ధతిలేదు. ఆవిడ తీయించుకోను తీయించుకోదు. ఆవిడ తీయించుకొన్నదల్లా తలమీద జుట్టు. ఆ జుట్టే కనుక వుండివుంటే తెల్లని ముగ్గుబుట్ట అని అనుకోవాలి. లేని దాన్ని గురించి వర్ణించి ప్రయోజనంలేదు. కాని ఆవిడ వర్చస్సు చూస్తే అపురూపము. ముడుతలుపడ్డా శరీరపటుత్వం చెడలేదు. ఆవేళ నాగులచవితి కావడంచేత ఉపోష్యమేమో కూడాను! అయినా రావడం మానలేదు. ఆమె చరిత్ర కొంతచెబితే ప్రస్తుత తరం వారికి వింతే! అసలు ఆవిడ ధరించిన పంచే సన్నని ఎఱ్ఱంచు పట్టుపంచె. అదే చెబుతుంది నిరంతరం మడిగట్టుకు ఆవిడ వుంటుందని. మరిన్నీ అగ్రవర్ణంలో జన్మించిన

కులాభిమానం కులగౌరవం ఆవిడను విడిచిపెట్టలేదు. ఆవిడకు పవిటవేసుకునే ఈడునే పెళ్ళయింది. పెళ్ళయిన సంవత్సరమే ఆమె పెద్దమనిషి అయింది. పెద్దమనిషి అయిన సంవత్సరమే కార్యం అయింది. కార్యం అయిన ఒక ఏడాదినుంచి ఏటేటా కానుపే. ఆవిడ ఈ కథాకాలానికి ఏ అరవైయేళ్ళ క్రితమో ఒక ముప్పైమందినయినా కని వుంటుంది అని నా తాత్పర్యము. పెళ్ళి కెన్నో బంగారపు వస్తువులు వెండివస్తువులు పాతరకానివి పెట్టు కుందిటకాని రానురాను మగడు ఈస్టుఇండియా కంపెనీ పనిలో దుబాష్ అయిన తరువాత అవన్నీ చాలవరకు చెరిపించి, మార్పించి వజ్రాల తమ్మెట్లు. ముక్కుపుడకలు అవీ పెట్టుకో సాగిందిట! తరువాత తరువాత వితంతువు అయినాక పైవన్నీ మానేసి, బిగుపుసళ్ళిన వేషం ధరిస్తూ ఒక బంగారపు గొలుసు మెళ్లో మెఱసేటట్టు వేసికొన్నది. మఱిన్నీ మగడు కార్యానికే రాత్రో గదిలో పెట్టి, ఆవిడకు తెలియకుండా తొడిగిన ఒక పొళ్ళఉంగరం కూడా వేలినే ఉంచుకొన్నది. ఇదంతా వ్రాయ డంలో నా సబబేమి అని పాఠకులడిగేరేమో? కారణం తెలియ జెప్పడానికే. ఆమె అంతచేటు ముసలివ్యక్తి అయినా జీవితవాంఛ వాసన ఇంకా వదల్లేదనడానికే? విన్నారా?

ఒకచేసొద కోడలితోనూ, కొడుకుతోను, కూడా మరి వెళుతూవున్న మనుమలతోను, మనుమరాళ్ళతోను, అసలు సుఫాలరావును మరెవరూ అడగడానికి వీల్లేకపోయింది. "తమకు ఏవూరు అండీ బదిలీ అయితే?" అని.

సుఫాలరావు పాపమ్మకెన్నో కొడుకో గాని, మంచి "టిప్‌టో" గా స్యూటువేసి టైగియ్ తగిలించుకొన్నాడు.

అందాకా తొడుక్కున్న కోటు ఊడదీసి "బెర్తు" ప్రక్కన వున్న చిలక్కొయ్యకు తగిలించాడు. ఒక సిగరెట్టు అగ్గిపెట్టి మీద కొట్టి అంటించుక్కులాసాగా కబుర్లు చెబుతూవున్నాడు. ఆ కబుర్లలో అతగాడు కాలం మరచిపోయాడు. గమ్యస్థానం మరచిపోయాడు.

చటుక్కున రయిలు కదలింది. చట్టున ఆవిరి విడిచి బుస బుస మంటూ చక్రాల్ని ప్లాట్‌ఫారమ్ దాటిపోయేలా బండి అంతకూ వేగం ఇచ్చింది.

"అమ్మా? నీవు దిగవే వెనక్కు వెళ్ళాలిలాగుంది. బండిలోనే వున్నావు! అంటూ ఆమె రెక్కుచ్చుకుని తానుకూడా ఆమెతోపాటు "ఫుట్‌బోర్డు" మీద నిలబడ్డాడు. ఆమెను సరిగ్గానే పట్టుకున్నాడు. దిగు దిగు అంటూనే వున్నాడు. కాని తాను రెండో చేతిలోవున్న సిగరెట్టు వదలలేకుండా వున్నాడు. ఆ సందిగ్ధావస్తను చూచి, బండిలోవున్న మూడో ఆయన ఎవరో గొలుసులాగారు. ఇంజిన్ బ్రేకడి గల్లంతు అయింది బండిఅంతా. ఆగిన ప్రయాణిని ముసీలి ఆమె దిగి దాటిపోయి కటకటాల ఆవల మోటారుకారులో పడింది. సుఫాలరావు ఆమెను చూస్తూ వుంటే సిగరెట్టు క్రింద పడిపోయింది.

మరి డ్రైవరు, గార్డు, గాడి గాడి చూస్తూ అందులో గొలుసు లాగడం కనిపెట్టి, ఏమి పడిపోయింది? అని అడిగారు సుఫాలరావుని? సుఫాలరావు ఫుట్‌బోర్డుమీద నిలబడివుండే "నా సిగరెట్టు పడిపోయింది" అన్నాడు. అసలు గొలుసు లాగిన ఆయన "నీ తల్లి పడిపోతూంటే బండిలో ఎవరోగాని లాగా రనక యిల్లాంటి జవాబు ఎందుకు చెప్తావయ్యా!" అన్నాడు.

డ్రైవరు గార్డుకూడా ఏక కంఠతో ఆ బండిలో వాళ్ళందరకూ వార్నింగు ఇస్తూ వెళ్ళిపోయారు.

సుఫాలరావు భార్య ఊరికే ఇదై యింది మగడు సిగరెట్టు కాలుస్తూ తల్లిని కూడా మఱచినాడని!

అయితే సిగరెట్! సిగరెట్! అది లోకమంతటా అందు లోను మగవాళ్ళకు విశేషంగా ఏలా అలవాటు అయిందో అని ఆశ్చర్యమే!

.... .... .... .... ....

## వంతెన మతం

వంతెన ఆవల క్రిష్టియన్ పేట. అక్కడక్కడ కుటీరాలు కొబ్బరిచెట్లల్లో కులాయాల్లాగుండి చిన్న చిన్న దారులు కలిగి, కలిసి, మెలసి వుండే కొద్దిపాటి జనంతో విరాజిల్లుతూ వున్న పేట అది. ఆ వంతెనదాటి అడుగుపెడితిమా ఆ పేట అంత అతి నిర్మలమైనది నీడయిచ్చేది మఱొకటి కానం. ఎండప్పుడే కాకుండా, వెన్నెలప్పుడుకూడా ఆ పేటలో కాపురంవున్నవాళ్ళు నీడనే ఆపేక్షిస్తారు. ఎంచేతా అంటే, నీడఅన్నది ఆ తావున అంత అందంగా వుంటుంది కాబట్టి. మఱిన్నీ ఆ నీడ ఆకాశం నుంచి పడే వెలుగుజాడల్తో ఆ వూరు మనిషిలో అదోవింత, వివేకము, వినోదమూ కూడా కలిగిస్తూవుంటుంది కాబట్టి.

వంతెన దాటకుండావుంటే అంతా దుమ్ముమయమైన రోడ్డు. రోడ్డుప్రక్కనే మహాపట్నం. ఆ పట్నాన్ని తలపోస్తిమా హిందూమతసంబంధమైన బాంధవ్యంబంధనం మదికొస్తుంది.